క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి

ఉరవకొండ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి సూచించారు. మంగళవారం మండలంలోని మూల గిరిపల్లిలో చట్టాలపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మెజిస్ట్రేట్ మాట్లాడుతూ మైనర్ బాలికలపై ర్యాగింగ్, లైంగిక దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయన్నారు. ఇందుకు సంబంధించి పోక్సో చట్టం అమల్లో ఉందన్నారు. ఆడపిల్లలను చదివించాల్సిన వయస్సులో బాల్యవివాహాలు చేసే తల్లిదండ్రులకు శిక్ష తప్పదన్నారు. మైనర్లు ద్విచక్రవాహనాలు, కార్లు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి కూలీలకు పనికి తగ్గ వేతనాలు అందుతున్నాయా లేదా అని మెజిస్ట్రేట్ అడిగి తెలుసుకున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: స్థానిక పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సోమవారం తెలిపారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

ఆమిద్యాల జెడ్పీ హైస్కూల్‌కు క్రీడా అవార్డు


డీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం, పీడీ

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రతిభా అవార్డు దక్కింది. అనంతపురంలోని జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల తరఫున హెచ్‌ఎం నాగమంజుల, ఫిజికల్ డైరెక్టర్ ఈశ్వరి అవార్డు అందుకున్నారు. ఆమిద్యాల హైస్కూల్ గతంలో ఆరుసార్లు క్రీడా ప్రతిభా అవార్డు అందుకుందని, గతంలో పని చేసిన పీడీ మారుతీప్రసాద్ తర్ఫీదులో విద్యార్థులు సెపక్‌తక్రా, ఫుట్‌బాల్ క్రీడల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారని, 7వ సారి కూడా పాఠశాలకు అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


కంబదూరులో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

కంబదూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ నుంచి వైఎస్సార్ సర్కిల్ మీదుగా పోలీసులు కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ త్వరలో జరగనున్న వినాయక చవితి ఉత్సవాలను, ఇటీవల చోటు చేసుకున్న పలు సంఘటనలను దృష్టిలో ఉంచుకొని శాంతిభద్రతల దృష్ట్యా ముందు జాగ్రత్తగా మండలంలో 30 యాక్ట్ అమలు చేస్తున్నామన్నారు. వినాయక ఉత్సవాలు నిర్వహించే వారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, తేజోమూర్తి, ఎస్‌ఐ రాజేష్, సుధాకర్, యువరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్టోత్సవాలు


అలంకరణలో గోపాలకృష్ణ స్వామి

ఉరవకొండ: స్థానిక బళ్లారి బైపాస్‌లో దేవాంగ ఫంక్షన్ హాల్ వెనుక నూతనంగా నిర్మించిన గోపాలకృష్ణ ఆలయంలో గణపతి, గోపాలకృష్ణ, ధ్వజ స్తంభ విగ్రహ ప్రతిష్టోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతం, గంగపూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, ప్రతిష్టామూర్తుల ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి హోమం, జలధివాసం మంత్రపుష్పం కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నూతన విగ్రహాల ఊరేగింపు ఉంటుందని నియోజకవర్గ యాదవ సంఘం కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజాశ్రేయస్సే సీఎం జగన్ లక్ష్యం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో విప్ కాపు రామచంద్రారెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మాల్యం గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పారెడ్డి, మల్రెగౌడ్, ఇమాంవలి, ఖాదర్,అధికారులతో కలిసి విప్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం పని చేస్తున్నారన్నారు. మాయమాటలు చెప్పే టీడీపీ నాయకులను ఎప్పటికీ నమ్మవద్దన్నారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏనాడూ ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోలేదన్నారు. దోపిడియే అజెండా బాబు అండ్ కో పాలన సాగించారన్నారు. ప్రజాధనాన్ని టీడీపీ నేతలు పందికొక్కుల్లా మెక్కారని మండిడ్డారు. 'నీరు–చెట్టు' పథకంలో బడాబాబులు కోట్లు దోచేస్తే 'జన్మభూమి' కమిటీ పేరుతో చోటనాయకులు, కార్యకర్తలు లక్షలు దోచేశారని మండిపడ్డారు. టీడీపీ హయంలో విద్యార్థులు, రైతులు, అక్కా చెల్లెమ్మలతో పాటు ఏ ఒక్కరు బాగుపడలేదన్నారు.

టీడీపీ హయాంలో ఇళ్ల బిల్లులు మింగేశారు!

సార్.... టీడీపీ హయాంలో మా పేర్లపై ఇళ్లు మంజూరయ్యాయి.. మేము కట్టుకోలేదు... ఇటీవల కొత్త ఇళ్ల కోసం అధికారుల వద్దకెళ్లితే మీకప్పుడే ఇల్లు మంజూరు చేశాం... బిల్లులు కూడా మంజూరు చేసేశాం! అని చెబుతున్నారని పలువురు మహిళలు విప్ కాపు దృష్టికి తెచ్చారు. మేమైతే ఇల్లు కట్టుకోలేదని, ఏ ఒక్క బిల్లు కూడా తీసుకోలేదని మహిళలు చెప్పారు. మాకు మంజూరైన బిల్లులు ఎవరి అకౌంట్లలో పడ్డాయో కూడా అర్థం కావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మీరేలాగైనా స్పందించి కొత్త ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ గూడెన్న, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మండల జేసీఏ కన్వీనర్ హనుమంతరావు, సొల్లాపురం సర్పంచు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హంపన్నగౌడ్, పి.బాషా, సుధాకర్, సుధాకర్, రహమతుల్లా, సిద్దేశ్వర, ముత్తు, సాధత్, ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, కెనిగుంట రామిరెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనికి భూమి పూజ

కణేకల్లు మండలంలోని కళేకుర్తి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన సిమెంటు రోడ్డుకు మంగళవారం విప్ కాపు రామచంద్రారెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ 'గడప గడపకూ' మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో పనులు చేపట్టడానికి రూ.20లక్షలు మంజూరు చేశారన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచు కె.భాస్కర్‌రెడ్డి, వైస్ సర్పంచు బోయ రామిరెడ్డి, ఎంపీటీసీ మారెన్న,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, నాయకులు ప్రకాష్, రాజారెడ్డి, రుద్ర, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీపీకి భూములిచ్చిన రైతులకు న్యాయం


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

బ్రహ్మసముద్రం: హంద్రీ–నీవా కాలువకు భూములిచ్చిన రైతులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ అధికారులుఅన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీటీపీ కాలువకు భూములిచ్చిన రైతులతో సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ బీటీపీ కాలువకు భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇటీవల మొదటి విడతగా రూ.135 కోట్లు విడుదల చేసిందన్నారు. నేరుగా రైతుల ఖాతాల్లోకే పరిహారం జమైందన్నారు. బీటీపీ కాలువ కోసం భూములిచ్చిన ప్రతి రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ రకాల సమస్యలతో పరిహారం అందని రైతుల ధ్రువీకరణ పత్రాలు సేకరించి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇతియాజ్, డీఈఈ ఎస్వీ రమణ, మల్లికార్జున, ఏఈ ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంట్లో కూర్చొని విచారణ చేస్తారా?


టీడీపీ నేతల ఇంట్లో కూర్చొని బీఎల్‌ఓలు విచారణ చేస్తున్నారని సెల్‌ఫోన్‌లో చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బసవరాజు

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు జాబితా సవరణలో భాగంగా బీఎల్‌ఓలు కొందరు టీడీపీ నేతల ఇంట్లో కూర్చొని విచారణ చేస్తున్నారని, టీడీపీ నేతలు సూచించిన వారి ఓట్లను తొలగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు మండిపడ్డారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శంకరయ్య అధ్యక్షతన రాజకీయ పార్టీ నేతల సమావేశం నిర్వహించారు. ఈఆర్‌ఓ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉరవకొండ నియోజకవర్గంలో 5,356 ఓట్ల మీద రీ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. రీవెరిఫికేషన్‌ను పర్యవేక్షించడానికి డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్‌ను ఎన్నికల సంఘం నియమించిందన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు హరిప్రసాద్, ఈరమ్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మునీంద్ర, ఎన్నికల సీనియర్ సహాయకుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జిహ్వేశ్వరస్వామి జయంతి


జిహ్వేశ్వరస్వామి చిత్రపటంతో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాయదుర్గంటౌన్: స్వకుళసాళి సమాజ బాంధవుల మూలపురుషుడైన జిహ్వేశ్వరస్వామి జయంతి ఉత్సవాన్ని పట్టణంలోని హటకేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో పూజల అనంతరం జిహ్వేశ్వరస్వామి భావచిత్రపటాన్ని వెండిరథంపై పురవీధుల్లో ఊరేగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్ శారదమ్మ, వార్డు ఇన్‌చార్జ్ శివకుమార్, సబ్ రిజిస్టర్ శ్రీనివాసులు, ఇతర ప్రముఖులు హాజరై స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం స్వకుళసాళి సమాజంలోని ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వకుళసాళి సమాజం(చేనేత), విద్యావర్ధక సంఘం, యువజన సంఘం, శ్రీరాజరాజేశ్వరి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

అంజన్నకు శ్రావణ పూజలు



బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజినేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండో మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ఎస్‌ఐ శివ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. బళ్లారిలోని చైతన్య పి.యు కాలేజ్ ప్రతినిధులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం


భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక చౌడేశ్వరీ కాలనీలోని పురాతన లక్ష్మీ వేంకటేశ్వరుని ఆలయంలో కల్యాణోత్సవం మంగళవారం కమనీయంగా సాగింది. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అభిజిత్ లగ్నం నందు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వేంకటేశ్వరుని వివాహం చేపట్టారు. ఈ సందర్భంగా మహా వరుణయాగం, లక్ష్మీనారాయణ హోమం, కుబేరహోమం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

వేలం మళ్లీ వాయిదా

రాయదుర్గంటౌన్: స్థానిక పురపాలక సంఘం కూరగాయల షాపింగ్ కాంప్లెక్స్ పైఅంతస్తులో నిర్మించిన 42 రూముల అద్దెకు నిర్వహించిన వేలం నాలుగోసారి కూడా వాయిదా పడింది. మంగళవారం షాపు రూముల అద్దెకు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేలానికి ఒక్కరు కూడా హాజరుకాలేదు. మార్కెట్ పై అంతస్తు కావడంతో వ్యాపార లావాదేవీలు తక్కువగా జరుగుతాయని, ప్రధానంగా నాన్ రిఫండబుల్ గుడ్‌విల్ కావడంతో డిపాజిట్, నిర్ణయించిన రూముల అద్దెలు తగ్గించాలని, రాకపోకలకు మెరుగైన వసతి కల్పించాలని, రెండు బ్లాక్‌లను కలిపే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయదుర్గం రూరల్: మండలంలోని వేపరాల, ఆవులదట్ల, కాశీపురం, మల్లాపురం గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఎంపీడీఓ కొండయ్య మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మల్లాపురం గ్రామంలో ఖాళీగా ఉన్న ఒక్క పోస్టుకు ఇద్దరు హాజరవడంతో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మిగిలిన వేపరాల, కాశీపురం, ఆవులదట్ల గ్రామాల పోస్టులకు మరోసారి దరఖాస్తులు ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ చిక్కణ్ణ పాల్గొన్నారు.

కూలీలు ఆధార్ అనుసంధానం చేయాలి

బొమ్మనహాళ్: ఉపాధి పథకంలో పనులు చేస్తున్న కూలీలకు సకాలంలో వేతనాలు పడాలంటే బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేయాలని రాయదుర్గం ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లలతో సమావేశం నిర్వహించారు. ఏలంజి, లింగదహాళ్, ఉంతకల్లు, శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, కురువల్లి గ్రామాల్లో ఇంకుడు గుంతలు తీయించాలని సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి ఏపీఓ రాజేష్‌కుమార్, టీఏలు రమేష్, బ్రహ్మయ్య, నాగరాజు, నాగేంద్ర తదతరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ

కూడేరు: స్థానిక బాలికల వసతి గృహాన్ని మంగళవారం రాత్రి జడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు తుప్పటి అశ్వని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుకు సంబంధించి రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎంత మంది సిబ్బంది ఉన్నారని దినకూలీ అశ్వర్థమ్మను ప్రశ్నించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ వార్డెన్ ఉన్నారని ,రెగ్యులర్ వంట మనిషిని నియమించకపోవడంతో పగలు ఒకరు, రాత్రి ఒకరు దినకూలీతో విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. బాలికలకు ఏర్పాటు చేసిన భోజన నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఏర్పాటు చేసిన చికెన్ తక్కువ మోతాదులో ఏర్పాటు చేయడంతో సిబ్బందిపై వారు మండిపడ్డారు. అనంతరం భోజనం బాగా పెడుతున్నారా? వసతులు సౌకర్యంగా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు రామాంజనేయులు, ఎర్రనాగప్ప తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల సామగ్రి సరఫరా

కూడేరు: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే పాఠశాల ఆవరణలో చిత్తు పేపర్లు , ఇతర చెత్త వేయకుండా ఉండేందుకు డస్ట్ బిన్లు, మరుగుదొడ్ల నిర్వాహణకు బకెట్లు, జగ్గులను మంగళవారం మండలానికి సరఫరా చేసింది. ఎమ్మార్సీలో ఉన్న వాటిని ఎంఈఓ చంద్రశేఖర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వీటిని మండలంలోని 37 పాఠశాలలకు అందజేసి మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణలో శుభ్రత నెలకొల్పేందుకు కృషి చేస్తామన్నారు.

కో-ఆప్షన్ సభ్యుడి రాజీనామా


జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్‌కు రాజీనామా లేఖ అందజేస్తున్న మహబూబ్‌సాబ్

అనంతపురం సిటీ: కంబదూరు మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ మహబూబ్ సాబ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సీఈఓ/జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను మంగళవారం మధ్యాహ్నం కలసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆయన వెంట కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజు ఉన్నారు.

కౌలు రైతులకు సాగు పత్రాలు


పాల్తూరులో కౌలు రైతుకు సాగు పత్రాలు అందజేస్తున్న ఏడీఏ, ఏఓ

విడపనకల్లు: మండలంలోని 277 మంది కౌలు రైతులకు పంట సాగు పత్రాలను ఉరవకొండ డివిజన్ ఏడీఏ పద్మజ, మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య మంగళవారం అందజేశారు. ఏడీఏ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కౌలు రైతులను ఆదుకునేందుకు బ్యాంకులో రుణ సదుపాయం కల్పించనున్నారన్నారు. మంగళవారం ఆమె మండలంలోని పాల్తూరు, విడపనకల్లు, గడేకల్లులో ఉన్న బ్యాంకులను సందర్శించి కౌలు రైతులకు పంట సాగు కోసం రుణాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు. కాగా 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఆర్‌బీకేలో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏడీఏ, ఏఓ సూచించారు.

పోస్టర్ల విడుదల

రాయదుర్గంటౌన్: ప్రజా సమస్యలపై సీపీఎం సమరభేరి కార్యక్రమాన్ని బుధవారం నుంచి సెప్టెంబర్ 4 వరకు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో సమరభేరి పోస్టర్లు విడుదల చేశారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం


కళ్యాణదుర్గం: ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు


రాయదుర్గం: సిద్దాపురం పాఠశాలలో తెలుగు అక్షరాలు చూపుతున్న విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాషాభిమానులు, అధ్యాపకులు, హెచ్‌ఎంలు, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాస, వక్తృత్వ పోటీలు నిర్వహించి , ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. తెలుగు భాష ఉద్యమకారుల సేవలను కొనియాడారు. మాతృ భాష పట్ల మమకారం తగ్గరాదని విజ్ఞప్తిచేశారు. ఆయా పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

బెళుగుప్ప: పంట కోత ప్రయోగాలపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఓబుళేసు, ఏఓ పృథ్వీసాగర్ తదితరులు వీఆర్‌ఓలు, ఎంపీహెచ్‌ఈఓలు, వీఏఏలు, వ్యవసాయశాఖ సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై ఏఎస్ఓ మమతతో కలసి వివరించారు. ఏఈఓ భాగ్య, వీఆర్‌ఓలు, గ్రామస్థాయి వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం

కళ్యాణదుర్గం: స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి తెలిపారు. అనంతరం 2022లో ఉత్తర ప్రదేశ్‌లోని అమృతసర్‌లో జరిగిన జాతీయ రెజ్లింగ్ పోటీలలో కళాశాల విద్యార్థిని హెచ్.శాంతి (సెకెండ్ బీఎస్సీ) కాంస్య పతకాన్ని సాధించి, జిల్లా ఉత్తమ క్రీడాకారిణిగా ఎంపిక కావడంతో.. శాంతిని కళాశాల బృందం అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకుడు జయరామప్ప, ఎన్ఎస్ఎస్ పీఓ, అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కె.శ్రీధర్, డాక్టర్ టీఎస్ శ్యాంప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తులను నిశితంగా పరిశీలించండి


అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ నిశాంత్ రెడ్డి

కళ్యాణదుర్గం: ఓటర్ల ఇంటింటి పరిశీలనలో సిబ్బంది దృష్టికి వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని ఎన్నికల సూపర్‌వైజర్లు, సహాయ ఓటరు అధికారులకు ఓటరు పరిశీలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ హౌస్ టు హౌస్ పరిశీలనలో దృష్టికి వచ్చిన ఫారం- 6,7,8లను ఏ విధంగా నమోదు చేయాలి..? ఏ ఏ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలి...? ఏ విధంగా వెరిఫికేషన్ ఇవ్వాలి..? అన్న విషయాలపై పలు సలహాలు, సూచనలిచ్చారు. ఏవైనా సందేహాలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.

నేడు భూమి పూజ

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం క్రాస్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మించడానికి బుధవారం భూమిపూజ చేయనున్నట్లు ఎంపీపీ విద్యావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోర్‌వెల్ నాగిరెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి భూమి పూజ చేస్తారన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ,పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

సమీకృత దాణాతో పాల దిగుబడి పెంపు

కూడేరు: పాలిచ్చే గేదెలు, ఆవులకు సాధారణ గ్రాసమే కాకుండా సమీకృత దాణా, మాంసకృత్తులు అధికంగా ఉన్న పిల్లిపెసర, అలసంద తీగ, సుబాబుల్ , అవిశ లాంటి కాయ జాతిగ్రాసాన్ని అందిస్తే పాల దిగుబడి పెంపొందుతుందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి డాక్టర్ సుధాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని ఇప్పేరులో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన పాడిపశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వాటికి మందులను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీనివాసులు, ఏహెచ్ఏ సుబహాన్, గోపాల మిత్రలు సుబ్బరాయుడు, తిరుపాల్,రాఘవయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలి

గుమ్మఘట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని, అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషికాహారాన్ని తనిఖీ చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత వుండేలా చూడాలన్నారు. నిత్యం పర్యవేక్షిస్తూ ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా ఏండేలా చూడాల్సిన బాధ్యత మీపై వుందన్నారు. మధ్యాహ్న భోజనం తయారులో నాణ్యత లేకపోతే ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు.

అందుబాటులో ఎరువులు

వజ్రకరూరు: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి మధుకర్ తెలిపారు.మం గళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 28-28-013, డీఏపీ, 18-18-18 ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి 80 శాతం రాయితీతో అలసందలు, ఉలవలు, కొర్రలు తదితర విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు.

'విద్యార్థిని చితకబాదడం దారుణం'

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భావన ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్న రంగచేడు గ్రామానికి చెందిన బాబును చితకబాదిన క్లాస్ టీచర్, స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టా. మంగళవారం స్కూల్ ఎదుటఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సీపీఎం నాయకులు ధర్నా చేశారు. బాలుడిని కొట్టిన టీచర్‌పై చర్యలు తీసుకోవడంతోపాటు పాఠశాలను సీజ్ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగిశివ, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొ్ట్రేష్, నియోజకవర్గ అధ్యక్షుడు అభిషేక్, శశి, విష్ణు, సుధీర్ పాల్గొన్నారు.